క్లుప్తంగా

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం కలుగుతుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన గురువారం వివరాలు తెలుపుతూ మహదేవపు రంకాలనీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా సనత్‌నగర్, మహదేవపురం కాలనీ, కామయ్యతోపు, 80 అడుగుల రోడ్డు, బందరు రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు కాల్వగట్టు ప్రాంతంలో తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ ప్రాంతంలో పైప్‌లైన్, మంచినీటి కుళాయి మరమ్మతులకు గురి కావడంతో పంచాయతీ కార్యాలయానికి ఫిర్యాదు అందింది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు కుళాయి, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణ చంద్రరావు మాట్లాడుతూ.. గ్రామంలో సురక్షిత తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వాటర్ ట్యాంకులు, మోటారు బోర్ల సహాయంతో తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా నిర్మాణం పూర్తయిన వాటర్ ట్యాంక్‌కు వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు త్వరలో నిర్వహిస్తామని చెప్పారు.

వివాహిత అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

పెనమలూరు: వివాహిత అదృశ్యంపై ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గ్రామానికి చెందిన కారేటి సుజాత కుటుంబ సభ్యులతో నివాసం ఉంటోంది. ఆమె పెద్ద కుమార్తె దానం మహిత వివాహం చేసుకొని ఏలూరు అత్త ఇంట్లో ఉంటుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. కాగా అత్తింటి వారితో గొడవ రావటంతో మహిత ఈ నెల 2న పెదపులిపాకలోని పుట్టింటికి వచ్చింది. అయితే 5వ తేదీ సాయంత్రం మహిత ఇంట్లో నుంచి అదృశ్యమైంది. దీంతో ఆమె తల్లి సుజాత పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: కానూరు మురళీనగర్‌లో ప్రమాదవశాత్తు వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు మురళీనగర్‌లో అపార్టుమెంట్‌లో మిలాన్ కిశోర్ తల్లి రేష్మాతో నివాసం ఉంటున్నాడు. కిశోర్ టవల్ రెండో ఫ్లోర్ నుంచి మొదటి ఫ్లోర్‌లో పడింది. దీంతో అతను ఇనుప రాడ్‌తో టవల్ పైకి తీస్తుండగా విద్యుత్ బోర్డుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అతని చేతులు, నడుం వరకు కాలింది. స్థానికుల సహకారంతో అతడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువతి అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువతి అదృశ్యంపై తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టీనర్‌పేట శ్రీనివాసరావు వీధికి చెందిన భౌరిశెట్టి శ్రీనివాసరావు ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుంటాడు. శ్రీనివాసరావుకు ముగ్గురు ఆడపిల్లలు. మూడో కుమార్తె సుకన్య డిగ్రీ వరకు చదివింది. కబేళా సెంటర్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న సుకన్య ఈ నెల 5వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

బీసీ కులగణన సాధించేందుకు పోరుబాట

బీఎస్పీ ఏపీ కో ఆర్డినేటర్ డాక్టర్ పూర్ణచంద్రరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): తెలంగాణ బీసీల ఉద్యమ స్ఫూర్తితో ఏపీలో బీసీ జనగణన కోసం పోరుబాట పట్టనున్నట్లు బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, విశ్రాంత డీజీపీ డాక్టర్ జుజ్జవరపు పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. విజయవాడ హరిత బెరంపార్క్‌లోని సమావేశ మందిరంలో ఏపీ బీసీ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి కార్యవర్గ శిక్షణ తరగతులలో భాగంగా తొలి రోజు గురువారం ఆయన మాట్లాడారు. చంద్రబాబు ప్రభుత్వం కులగణనపై కేబినెట్‌లో ఎందుకు చర్చకు పెట్టడం లేదని ప్రశ్నించారు. బీసీల మనుగడకు రాజ్యాధికారం, రాజకీయ ప్రాతినిధ్యానికి కులగణన తప్పనిసరని అన్నారు.

శ్వేతపత్రం ఏదీ ?

రాష్ట్రంలోని పలు సమస్యలపై శ్వేతపత్రాలను విడుదల చేసిన చంద్రబాబు ప్రభుత్వం కులగణనపై ఎందుకు ఇవ్వలేదని పూర్ణచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు అధికారాన్ని పంచటం నేర్చుకోమని కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. సమావేశంలో బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు, రాష్ట్ర కన్వీనర్ బీసీ రమణ, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, వీఆర్ నారగోని తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పోరంకి పీహెచ్‌సీకి మోక్షం

- పీహెచ్‌సీలో సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశం
- ఆస్పత్రిని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు



పోరంకిలో వైద్యులను ప్రశ్నిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ఠ

పెనమలూరు: పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం లభించనుంది. గత ప్రభుత్వం పోరంకి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే అధికారుల సమన్వయలోపం, భవనం లేదన్న సాకుతో ఇంతకాలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించలేదు. పైగా సిబ్బందిని నియమించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వ్యవహారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దృష్టికి వెళ్లటంతో ఆయన వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. వివరాల్లోకి వెళితే పెనమలూరు మండలం, తాడిగడప మున్సిపాలిటీకి కలిపి కేవలం పెనమలూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. దాదాపు 5 లక్షల జనాభాకు ఇక్కడి నుంచే వైద్య సేవలు, మందులు పంపిణీ జరుగుతున్నాయి. మొత్తం 30 గ్రామ సచివాలయాలకు పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచే సేవలు అందించాలి. మండల జనాభా పెరగటం, క్షేత్రస్థాయిలో వైద్య సేవలు విస్తృతపర్చటం కోసం పోరంకిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆరోగ్య కేంద్రం మంజూరు చేసి సిబ్బందిని నియమించింది.

అధికారుల సమన్వయ లోపం..

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇంతకాలం అధికారులు ప్రారంభించలేదు. సిబ్బందిని నియమించినా ఆరోగ్య కేంద్రం సేవలు ప్రజలకు అందలేదు. అధికారుల్లో సమన్వయ లోపం దీనికి ప్రధాన కారణమని చెబుతున్నారు. ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం లేదని సాకులు చూపారు. వాస్తవానికి పోరంకిలో దాత గతంలోనే ఆరోగ్య కేంద్ర భవనం నిర్మించారు. ఈ భవనంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో వైద్య సేవలు ప్రశ్నార్థకంగా మారాయి. ఈ సమస్యను గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లటంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మోక్షం కలిగి త్వరలో ప్రారంభించటానికి చర్యలు చేపట్టారు.

ఇప్పటికైనా ప్రజలకు న్యాయం చేస్తారా..?

పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు ఇప్పటికైనా న్యాయం చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభిస్తే కనీసం 10 సచివాలయాలను అనుసంధానం చేయాల్సి ఉంది. అలాగే మందులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి దీనిని విభజించాలి. పోరంకి ఆస్పత్రిని 24 గంటల ఆస్పత్రిగా ఏర్పాటుచేసి, ఫీల్డ్ స్టాఫ్, వ్యాక్సిన్ కూడా ఇక్కడి నుంచే పంపిణీ చేయాలి. అయితే కొందరు అధికారులు దీనిని నీరుగార్చే యత్నం చేస్తున్నట్లు సమాచారం. పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థానంలో అర్బన్ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ)గా మార్చి తూతూమంత్రంగా సేవలు అందించాలని యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా జరిగితే ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించే పరిస్థితి ఉండదని వైద్య సిబ్బందే చెబుతున్నారు. పైగా ఇప్పుడు మంజూరు చేసిన పోస్టులు రద్దయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఏది ఏమైనా అధికారులు పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించగలిగితేనే ప్రజలకు న్యాయం జరుగుతుంది.

జిల్లా వైద్యాధికారి పరిశీలన

పోరంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుచేయటానికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ శర్మిష్ఠ గురువారం పరిశీలించారు. ఇంతకాలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎందుకు ఏర్పాటు చేయలేదని స్థానిక వైద్యులను ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 12వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



పోరంకిలో ఆరోగ్య కేంద్ర భవనం

ఏఐతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు



ఏఐ అటోనోమస్ హాకథాన్‌లో ప్రదర్శనను వివరిస్తున్న విద్యార్థిని

పెనమలూరు: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేథస్సు)తోనే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ డీమ్డ్ టుబీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు అన్నారు. కాలేజీలో గురువారం జాతీయ స్థాయిలో ఏఐ అటోనోమస్ హాకథాన్ -2025ను ప్రారంభించి ప్రసంగించారు. ఏఐతోనే రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చడానికి కీలక పాత్ర వహిస్తుందన్నారు. విద్యార్థులు ఏఐ నేర్చుకోవటం వలన పరిశోధన చేయటం, స్మార్ట్ గవర్నెన్స్, హెల్త్ కేర్, వ్యవసాయం, పరిశ్రమల్లో ఆటోమేషన్ వంటి కొత్త ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఏఐ అటోనోమస్ హాకథాన్ -2025లో దేశవ్యాప్తంగా 1300 మంది విద్యార్థులు పాల్గొని పలు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ప్రో.వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, కన్వీనర్ డాక్టర్ డి.రాజేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11న శ్రీలక్ష్మీతిరుపతమ్మ వార్షిక కల్యాణోత్సవం



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న కమిటీ సభ్యులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ఈ నెల 11వ తేదీన అమ్మవారి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆయన శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి వారి కల్యాణోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. కల్యాణ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 9న ముత్తైదువులకు గాజుల అలంకరణ, అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. ఈ నెల 10న అమ్మవారిని పెండ్లి కుమార్తెగా అలంకరణ, శ్రీలలితా సహస్రనామ పారాయణ మండల దీక్ష ముగింపు, కోలాట నృత్య ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ నెల 11వ తేదీ ఉదయం అఖండ దీపారాధన, కంకణధారణ, రాత్రి 9 గంటలకు కల్యాణోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. కల్యాణోత్సవంలో గన్నవరంతో పాటు పరిసరా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొనాలని కోరారు. కమిటీ సభ్యులు జాస్తి ఫణిశేఖర్, చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణుగోపాలరావు, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయం



గన్నవరంరూరల్: పూర్వ విద్యార్థుల సహకారం అభినందనీయమని గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్ఎం కేఎస్ జగదీశ్వరరావు అన్నారు. పూర్వ విద్యార్థి చిట్టినేని పూర్ణచంద్రరావు 70 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను, సర్టిఫికెట్లు పెట్టుకునే ఫైల్స్‌ను గురువారం అందజేశారు. దాతను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. బీబీగూడెం మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ చదరంగం పోటీల్లో ప్రతిభ



జస్వంత్‌ను అభినందిస్తున్న హెచ్ఎం నిర్మల, గ్రామ ప్రముఖులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సెంట్రల్ జోన్ ఆటల పోటీల్లో బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చదరంగంలో ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సెంట్రల్ జోన్ స్థాయి ఆటల పోటీల్లో 9వ తరగతి విద్యార్థి కె.జస్వంత్ కుమార్ చెస్‌లో రన్నర్‌గా నిల్చాడని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల తెలిపారు. గ్రామ ప్రముఖులు, పాఠశాల ఉపాధ్యాయుల సమక్షంలో జస్వంత్ కుమార్‌ను గురువారం సత్కరించారు. గ్రామ ప్రముఖుడు గుండపనేని ఉమావరప్రసాద్ ప్రోత్సాహక నగదు బహుమతిని అందజేశారు. వ్యాయామోపాధ్యాయుడు వి.లక్ష్మణరావు, స్టాఫ్ కార్యదర్శి మానికొండ రమణగోపాల్ పాల్గొన్నారు.

విద్యార్థులను అలరించిన ఫన్నీ క్లబ్ షో



ప్రదర్శన ఇస్తున్న ఫన్నీ క్లబ్ సభ్యులు

గన్నవరంరూరల్: మండలంలోని ముస్తాబాదలో జెడ్పీ హైస్కూల్‌లో గురువారం విద్యార్థులను ఫన్నీ క్లబ్ షో అలరించింది. ఫైన్ ఆర్ట్స్ చదువుకున్న ఇటలీ, ఫ్రాన్స్ దేశాలకు చెందిన కళాకారులు విచ్చేసి వివిధ రకాల కళారూపాలు ప్రదర్శించారు. ఇంగిలేల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. హెచ్ఎం రాజగోపాల్, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్ జెట్టి నానారావు మాట్లాడుతూ.. విదేశాల నుంచి ఎంతో ఉన్నత లక్ష్యంతో ఫన్నీ క్లబ్ షో సభ్యులు మన పాఠశాలకు వచ్చారన్నారు. వారి సూచనలు మార్గదర్శకంగా స్వీకరించి క్రమశిక్షణగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. చదువుతో పాటు ఆట పాటలు కూడా ముఖ్యమేనని చెప్పారు. ఆనందంగా చదువుకుంటూ ఎదగటం సమాజానికి మేలు చేస్తుందన్నారు. మనో వికాసం వల్ల మంచి పౌరులుగా తయారవుతారని తెలిపారు. ఉపాధ్యాయుడు దామోదర గణపతి పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీసేలా బోధన



ఉయ్యూరు: సృజనాత్మకత వెలికితీసేలా బోధన ఉండాలని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ అన్నారు. పట్టణంలోని ఫ్లోరా పాఠశాలలో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఆర్డీఓ హెలా షారోన్ గురువారం ప్రారంభించారు. విద్యార్థుల శక్తి, అభ్యసన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. సైన్స్ పట్ల అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీవైఈఓ పద్మారాణి, ఎంఈఓ బి.సుధారాణి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



గన్నవరం: జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు గన్నవరానికి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికై నట్లు పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా కార్యదర్శి వి.రవికాంత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గన్నవరానికి చెందిన రెహాన్, పి.కీర్తిశ్రీ ఇటీవల నంద్యాలతో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చారన్నారు. వీరి టాలెంట్‌ను గుర్తించిన సెలక్టర్లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరు ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. రెహాన్, కీర్తిశ్రీతో పాటు వీరికి శిక్షణ ఇచ్చిన డి.నాగరాజును ఆయన అభినందించారు.

పోరంకిలో దంపతులపై దాడి

పెనమలూరు: పోరంకి సాలిపేటలో దంపతులపై పలువురు వ్యక్తులు దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎం.భవాని, భర్త కృష్ణ అపార్టుమెంట్‌లో వాచ్‌మెన్‌గా ఉంటున్నారు. ఆమె ఆపార్టుమెంట్‌లో పని చేస్తుండగా అకారణంగా నాగు, పవన్, ఉపేంద్ర అనే వ్యక్తులు బూతులు తిడుతూ ఆమెపై దాడి చేశారు. అడ్డు వచ్చిన భర్త కృష్ణను కొట్టారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కృపానందం, చిన రాజు

గన్నవరంరూరల్: ఉద్యోగ విరమణ చేసిన గ్రంథాలయ ఉద్యోగులకు అదే రోజు మొత్తం బకాయిలు చెల్లించాలని గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు కె.కృపానందం, కార్యదర్శి ఎస్.చిన రాజు కోరారు. ఈ మేరకు విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.రవికుమార్‌కు ఉద్యోగుల సంఘం నాయకులతో కలసి గురువారం వినతి పత్రం అందజేశారు. శాశ్వత ఉద్యోగులకు డూప్లికేట్ సర్వీసు రిజిస్టర్‌లు మంజూరు చేయాలని, ప్రతి సంవత్సరం ఉద్యోగుల సీనియారిటీ ప్రతి క్యాడర్‌లో జాబితాల సమాచార పంపిణీ విషయం ప్రకటించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు జిల్లా గ్రంథాలయ సంస్థ నిధుల ద్వారా జమ చేయవలసిన చందా సొమ్ము విషయంలో మిగిలిన జిల్లాల మాదిరి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. ఉద్యోగుల సంఘం నాయకులు కేవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సాలార్ షరీఫ్, తోకల రాంబాబు, షేక్ రహీం, కోగంటి పద్మావతి పాల్గొన్నారు. ఉద్యోగుల వినతిపై చర్యలు తీసుకుంటానని కార్యదర్శి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

తాళ్లాయపాలెం శివక్షేత్రానికి శివలింగాకృతులు అందజేత



శివలింగాకృతులను తాళ్లాయపాలెం తరలిస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: గుంటూరు జిల్లా అమరావతి సమీపంలోని తాళ్లాయపాలెంలో నిర్మిస్తున్న శివక్షేత్రానికి బాపులపాడు మండలం వీరవల్లికి చెందిన భక్తులు లక్షా 12 వేల శివలింగాకృతి ప్రతిమలను పంపించారు. శివాలయం నిర్మాణంలో అధిక సంఖ్యలో భక్తులను భాగస్వాములను చేసేందుకు తాళ్లాయపాలెం శివస్వామి ఆధ్వర్యంలో ఇటీవల వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా సేవా సమితికి మట్టి అందించారు. దీంతో షిర్డీ సాయిబాబా సేవా సమితి భక్త బృందం నెలరోజుల పాటు శ్రమించి లక్షా 12 వేల శివలింగాకార ప్రతిమలను మట్టితో తయారు చేశారు. మేళతాళాలతో ఊరేగింపుగా శివస్వామి భక్తుల ద్వారా తాళ్లాయపాలెం పంపించారు. షిర్డిసాయిబాబా సేవా సమితి సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మి, కట్టా సత్యవతి, ఆత్కూరి అరుణ, లంక బేబి సరోజిని, శ్రీలక్ష్మి, యలమంచిలి మాధవరావు, నామాల గాంధీ, పేర్ని ప్రవీణ, రాయి ప్రభావతి, రజిని పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



చిన్న అవుటపల్లి వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సురేష్

ఉంగుటూరు: రోడ్డు భద్రత నియమాలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలని మండలంలోని ఉంగుటూరు, ఆత్కూరు పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు గోవిందు, సురేష్‌లు చెప్పారు. రోడ్డు భద్రత మహోత్సవాలను పురస్కరించుకుని వాహన చోదకులకు గురువారం ఎస్ఐలు అవగాహన కల్పించారు. ఆత్కూరు ఎస్ఐ చిన్న అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రి వద్ద, ఉంగుటూరు ఎస్ఐ ఉంగుటూరులో ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా బైక్ నడుపుతున్న పలువురిని గుర్తించి రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలకు కారణాలను వివరించారు. మార్చి ఒకటో తేదీ నుంచి కొత్త మోటరు వాహన చట్టంలోని నిబంధనల ప్రకారం భారీగా జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. వాహన చోదకులు తప్పనిసరిగా రహదారి భద్రత సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



అంబాపురంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు

అంబాపురం(విజయవాడరూరల్): జిల్లా పంచాయతీ అధికారి పి.లావణ్యకుమారి ఆదేశాల మేరకు విజయవాడ రూరల్ మండలంలోని గ్రామాల్లో గురువారం పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు బుధవారం డీపీఓ ప్రత్యేక సమావేశం నిర్వహించిన క్రమంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మందకొడిగా జరుగుతున్నాయని గుర్తించామన్నారు. తప్పని సరిగా ప్రతి రోజు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపర్చాలని ఆదేశించిన నేపథ్యంలో మండలంలోని గ్రామాల్లో డ్రెయినేజీ కాల్వల్లో మురుగు పారుదల అయ్యే విధంగా వ్యర్థాలను తొలగించారు. పూడుకుపోయిన కాల్వలను జేసీబీ మిషన్లతో కొత్త తవ్వకం పనులు ప్రారంభించారు. అంబాపురం గ్రామంలోని ఒకటో వార్డులో ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న మురుగు నీటిని బయటకు పంపేందుకు కాల్వలను తవ్వే పనులు చేశారు. ప్రధాన గ్రామంలోనూ డ్రెయినేజీ కాల్వల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను, పి.నైనవరం గ్రామం బీసీ కాలనీలో, మెయిన్ రోడ్డులో మురుగు కాల్వల్లో పారిశుద్ధ్య కార్మికులు వ్యర్థాలను తొలగించారు. పాతపాడు, శివారు గ్రామాలైన వెంకటాపురం, అప్పారావుపేట గ్రామాల్లో మురుగు కాల్వల్లో నీరు పారుదల అయ్యే విధంగా కార్మికులు పనులు చేశారు. గ్రామాల్లో ప్రతి రోజూ పారిశుద్ధ్య పనులు నిర్వహించినట్లు ఫొటోలు సేకరించి పంపాలని ఈఓఆర్డీ ఎంవీడీ ప్రసాద్ తెలిపారు. అంతే కాకుండా చెత్త సంపద కేంద్రాల పని విధానంపై పూర్తి సమాచారం పంపాలన్నారు.

11న కంకిపాడులో పాటల పోటీలు

కంకిపాడు: ఘంటసాల 51వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 11న కంకిపాడు శివాలయంలో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు ఘంటసాల - ఎన్టీఆర్ సంగీత కళాపీఠం కంకిపాడు మండల అధ్యక్షుడు బాపట్ల నాగేశ్వరరావు, పామర్రు అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ తెలిపారు. స్థానిక శివాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. 15 ఏళ్ల లోపు బాల బాలికలకు భక్తి, ప్రబోధ, జానపద గీతాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఔత్సాహిక గాయకులు 79817 68971, 73866 23213 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. అదే రోజు కూచిపూడి, భరత నాట్య ప్రదర్శన జరుగుతుందని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

జ్ఞానవంతమైన పౌరులుగా ఎదగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు జ్ఞానవంతమైన పౌరులుగా ఎదిగినప్పుడే సమాజానికి మేలు కలుగుతుందని ఓఎన్‌జీసీ మాజీ డైరెక్టర్ సీపీకేఎం పద్మనాభన్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో 'స్వామి వివేకానంద స్ఫూర్తితో-మేల్కొని- ఆలోచించు' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన పద్మనాభన్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యను అభ్యసించటమే కాకుండా జ్ఞానాన్ని సంపాదించటం, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, జీవన నైపుణ్యాలను అభివృద్ధి పరచుకునేందుకు పాటుపడాలన్నారు. తద్వారా వ్యక్తిగత మానసిక వృద్ధి జరిగి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో జరుగుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శరవణకుమార్ అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్స్ ఏ పతంజలిశాస్త్రి, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ ఏ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాలు, రేషన్ డిపోల్లో తనిఖీలు



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఎండీయూ ఆపరేటర్లు రేషన్ కార్డుదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని, కార్డుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని విజయవాడ సర్కిల్-2 సహాయ పౌర సరఫరాల అధికారి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల అధికారి పాపారావు ఆధ్వర్యంలో గురువారం సర్కిల్-2 ఏరియాలోని రేషన్ డిపోలను, ఎండీయూ వాహనాలను సెంట్రల్ ఎంఆర్ఓ మద్దినేని వెంకటరామయ్యతో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాణిగారితోటలోని 289, భ్రమరాంబపురంలోని 315 రేషన్ డిపోలను, ఎండీయూ వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు ప్రకారం స్టాక్ నిల్వలు, స్టాక్ బోర్డులను పరిశీలించారు. సక్రమంగా నిత్యావసరాలు అందుతున్నాయా లేదా అని కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్డుదారులందరికీ నిత్యావసరాలు పంపిణీ చేయాలని, వారి నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాలను ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులు కచ్చితంగా నిర్వహించాలని సూచించారు. తనిఖీల్లో చెకింగ్ ఇన్‌స్పెక్టర్ మణికంఠ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.